పేద విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు

విద్యార్థినికి కళాశాలలో ఉచిత అడ్మిషన్ ఫారాన్ని అందజేస్తున్న అశీష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్, జూన్ 25 : చదువుకోవాలనే తపన ఉండి ఆర్థిక సమస్యలతో చదువుకు దూరమవుతున్న వారికి అశీష్‌కుమార్ విద్యాదీవెన ఉచిత విద్యా శిబిరంలో భాగంగా ఉచితంగా ఇంటర్, డిగ్రీ కోర్సులలో అడ్మిషన్లను ఇస్తున్నట్లు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు అశీష్‌కుమార్ యాదవ్ అన్నారు. ఈ శిబిరంలో పేద విద్యార్థినులకు ఉచిత అడ్మిషన్ దరఖాస్తు ఫారాలను అందజేశారు.

మల్లేపల్లిలో నేడు జాబ్ మేళా..

సుల్తాన్‌బజార్, జూన్ 25 : నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పించేందుకు నేడు ప్రైవేట్ సంస్థల జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎస్ మైత్రిప్రియ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గౌతమ్‌మోడల్ స్కూల్స్, స్కిల్ టైరో సంస్థలలో టీచర్, మెడికల్ కోడింగ్, కాస్మటాలజీ, అసిస్టెంట్, ఫార్మసీ అసిస్టెంట్ తదితర ఉద్యోగాల భర్తీకై జాబ్‌మే ళాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పది, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 26న విజయనగర్ కాలనీ మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్ ఆవరణలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాల యంలో హాజరుకావాలని కోరారు. వివరాలకు 8328428933 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

బోనాలకు రూ. 20 కోట్లు విడుదల చేయడం సంతోషకరం

సీఎం రేవంత్‌రెడ్డితో లాల్ దర్వాజ మహంకాళి ఆలయం మాజీ చైర్మన్ కె. వెంకటేశ్

అబిడ్స్, జూన్ 25: తెలంగాణలో నిర్వహించే ఆషాఢ బోనాల ఉత్సవాల కోసం రూ. 20 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి లాల్ దర్వాజ మహంకాళి దేవాలయం మాజీ చైర్మన్ కె. వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల లాల్‌దర్వాజ మహంకాళి ఆలయ కమిటీ తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా మంత్రులు, ఎమ్మెల్యేలతో కమిటీ ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు.

హరిత హారంపై నీలినీడలు

- వర్షాకాలం ప్రారంభమైనా ఊసే ఎత్తని ప్రభుత్వం
- నిర్వహిస్తారా..? లేదా..? అన్న సందిగ్ధంలో అధికారులు
- పూర్తికాని టెండర్ల ప్రక్రియ

చార్మినార్, జూన్ 25 : నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు గత ప్రభుత్వం చొరవ అమోఘం. నాడు ఉత్సవంలా హరితహారాన్ని వాడవాడలా నిర్వహించేందుకు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమాయత్తమయ్యేవారు. కాని నేడు తొలకరి జల్లులు కురిసి వారాలు గడుస్తున్నా ముందుకు సాగని వైనం...అటు ప్రభుత్వం కాని, అధికారులు కాని వన మహోత్సవ ఉత్సవ నిర్వహణపై ఎలాంటి క్లారిటీ లేకుండానే వర్షాకాలాన్ని వెళ్లదీస్తున్నారు.

వాతవరణ సమతుల్యతను కాపాడేందుకు..

వాతవరణ సమతుల్యతను కాపాడేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఏటా వర్షాకాలంలో ఉత్సవంలా హరితహారాన్ని ఘనంగా నిర్వహించేది. అందు కు స్థానిక ప్రజా ప్రతినిధులతోపాటు స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళశాలల విద్యార్థులను భాగస్వాములను చేస్తూ మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకున్నారు. కాని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రస్తుతం వర్షకాలం ప్రారంభమైనా కనీసం హరితహారంపై ఆలోచన చేస్తున్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కనిపించడం లేదు.

హరిత హారం పేరుమార్చి..

కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమ పేరును మార్చి వన మహోత్సవంగా రూపాంతరం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించాలని వివిధ విభాగాల అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. కాని ఎప్పటి నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలనే మీమాంస అధికారుల్లో వ్యక్తమవుతుంది. నర్సరీల్లో మొక్కల అందుబాటు కోసం అధికారులు టెండర్ల ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుంది. వన మహోత్సవ నిర్వహణపై అధికారుల్లోని డోలయమానంతో టెండర్ల ప్రక్రియపై నేటికి అధికారులు నిర్ణయం తీసుకోలేని పరిస్థితి నెలకొంది.

పూర్తిస్థాయిలో లేక పోవచ్చు..

ఇప్పటి వరకు ఉన్న సమచారం మేరకు ప్రభు త్వం జూలైలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సూచన ప్రాయంగా తెలిపిందని జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు తెలిపారు. ఎప్పుడు ప్రారంభం కానుంద నే విషయంపై సందిగ్ధత నులకొంది. అందులోనూ మొదటిసారిగా ఇప్పటికే మొక్కలను నాటిన చోట ఎక్కడైనా మొక్కలు ఎదగలేక పోయినా, చెట్లు కూలిపోయిన ప్రాంతాల్లో ముందస్తుగా వన మహోత్సావన్ని నిర్వహించాలని ఉన్నతాధికారులు సూచించారని, గురువారం జరిగే సమీక్షా సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

‘రేపటి మైదానం’ పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్

తెలుగు యూనివర్సిటీ, జూన్ 25. ప్రముఖ కవి డాక్టర్ ఎన్. గోపీ రచించిన కవితా సంపుటిలోని ప్రతి కవిత గోపీ అరవై దశాబ్దాల జీవన యానంలోని మైలు రాళ్లని ఆంధ్ర జ్యోతి ఎడిటర్ డాక్టర్ కె. శ్రీనివాస్ అన్నారు. మంగళ వారం కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని తెలుగు విశ్వ విద్యాలయంలోని ఎన్‌టీఆర్ కళా మందిరంలో ప్ర ముఖ కవి డాక్టర్ ఎన్ గోపీ అమృతోత్సవం సందర్భంగా తను రచించిన 75 కవితల సంపుటి ‘రేపటి మైదానం’ పుస్తకావిష్క రణ–అంకితోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని సుప్రసిద్ధ విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, ఓయూ తెలుగు శాఖ మాజీ అధ్యక్షుడు ఆచార్య సూర్య ధనుంజయ, ప్రముఖ కవి డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, విమర్శకుడు,కవి ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ రఘు, రచయిత వంగత హర్షవర్ధన్‌లతో కలిసి ఆవిష్కరించారు. రచయిత డాక్టర్ ఎన్. జతిన్‌కుమార్, కవి కుడికాల వంశీధర్, కవి,విమర్శకులు పుప్పాల శ్రీ రామ్, సిటి కళాశాల తెలుగు శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె నీరజ,కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ అధ్యక్షులు డాక్టర్ ఆర్ ప్రభాకర్‌రావు, కార్య దర్శి మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు..

క్రీడాకారుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, జూన్ 25: దేశ వ్యాప్తంగా క్రీడా కారులకు ఉజ్వల భవిష్యత్తు ఉన్నదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్‌కు చెంది న హ్యాండ్ బాల్ ఇండియాటీమ్ కోచ్ బైరు బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఓపె న్ సెంట్రల్ ఏషియన్ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఇండియా టీమ్ కాంస్య మెడల్స్‌ను సాధించింది. మంగళవారం బాలకృష్ణను ఆయన శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వం విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్‌లు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని అన్నారు. భోలక్‌పూర్ వాసులు బాబూరావు, కొండల్, ఉపేందర్ పాల్గొన్నారు.

బోనాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

బోనాల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కిషన్‌కుమార్

కార్వాన్, జూన్ 25 : బోనాలను శాంతి యుతంగా నిర్వహించుకోవాలని ఆసిఫ్‌నగర్ డివిజన్ ఏసీపీ బి. కిషన్ కుమార్ సూచించారు. రానున్న బోనాల నేపథ్యంలో ఆసిఫ్ నగర్, కుల్సుంపురా, టప్పాచబుత్రా డివిజన్ పరిధిలోని పలు ఆలయాల నిర్వాహకులు, స్థానిక నాయకులు, పోలీస్, దేవాదాయ, రెవెన్యూ, జీహెచ్ఎంసీ విభాగాల అధికారులతో కార్వాన్‌లోని ఎస్‌డీఏ ఫంక్షన్ హాల్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. కుల్సుంపురా ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు బైరి రాజు, రాములు, రామస్వామితో పాటు ఎస్.ఐ లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సంప్రదాయ సంకీర్తనలపై శిక్షణ

అంబర్‌పేట, జూన్ 25 : సాయిశృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో సంప్రదాయ సంకీర్తనలపై శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ వసుధామూర్తి తెలిపారు. సోమ, గురు వారాల్లో సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు వారానికి రెండు రోజులు ఒక బ్యాచ్, మంగళ, శుక్రవారాలు ఉదయం 11.30 నుంచి 12.30 వరకు రెండో బ్యాచ్‌కు శిక్షణ ఉంటుందని అన్నారు. మొదటి బ్యాచ్ జూలై 1వ తేదీ నుంచి రెండో బ్యాచ్ జూలై 2వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 8374927736లో సంప్రదించాలి.

బాలకార్మికుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ

అవగాహన ర్యాలీలో.. విద్యార్థులు

చిక్కడపల్లి, జూన్ 25 : బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం బాల కార్మికుల దినోత్సవరం సందర్భంగా విద్యార్థులు బాలకార్మిక వ్యవస్తను పూర్తిగా నిర్మూలించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల డైరెక్టర్ డాక్టర్ రిషి కాంత్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను పనిలోకి పంపించకుండా స్కూల్‌కి పంపించాలని సూచించారు. లా కాలేజీ ప్రిన్సిపాల్ సృజన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తున్నా..

కార్పొరేటర్లలతో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్, జూన్ 25: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి. రాజాసింగ్ అన్నారు. హిందీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కార్పొరేటర్లు రాకేష్ జైస్వాల్, డాక్టర్ సురేఖ, లాల్‌సింగ్, తాసీల్దార్ ప్రేమ్‌కుమార్‌లతో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఏ విధమైన సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గం పరిధిలో 135 మం దికి షాదిముబారక్, 200 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నయాబ్ తాసీల్దార్ డి. హారిక, రెవె న్యూ ఇన్‌స్పెక్టర్ జె. అశ్విన్‌కుమార్ పాల్గొన్నారు.

ఐజక్‌రాజ్‌కు.. అవార్డు

నల్లకుంట డివిజన్‌కు చెందిన లయన్స్ క్లబ్ సభ్యుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా మీడియా ఇన్‌చార్జి డాక్టర్ ఐజక్‌రాజ్ కు జాతీయ సేవారత్న అవార్డు లభించింది. ఇంటర్నేషనల్ ఇన్సానియత్ కి కిడ్మత్ సొసైటీ తరపున రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ అవార్డును హైకోర్టు రిటైర్డ్ జడ్జీలు జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ మాల్యాద్రి, ఇన్సానియత్ కి కిడ్మత్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు రెహమాన్, సినీ ప్రొడ్యూసర్ రహమతుల్లా అందజేశారు. – అంబర్‌పేట

కరాటే నేర్చుకోవడానికి ముందుకు రావాలి

కరాటే నేర్చుకోవడానికి విద్యార్థులు ముందుకు రావాలని సెయింట్ జోసెఫ్ పబ్లిక్ స్కూల్ గౌర్నింగ్ కౌన్సిల్ యు. రాజారెడ్డి పిలుపు నిచ్చారు. తెలంగాణ, ఏపీ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో అండర్ 19 బాలికల విభాగంలో చాంపియన్ షిప్ ట్రోఫీలో సెయింట్ జోసెఫ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొని 10 బంగారు, 4 రజిత, 8 కాంస్య పథకాలను కైవసం చేసుకున్నారు. ప్రిన్సిపాల్ రిబేక, వైవిరెడ్డి, జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, అంటోని, అమృతారెడ్డి, శాంత పాల్గొన్నారు. – కాచిగూడ, జూన్ 25

రామచంద్రకు నివాళి

త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా మంగళవారం కవి తిరుమల రామచంద్ర సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని రామచంద్ర చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ పాత్రికేయుడు జయసూర్య, గుండవరపు గీతాదేవి, జయరాములు పాల్గొన్నారు. – ముషీరాబాద్

సన్నాహక సమావేశానికి రావాలని ఆహ్వానం

గోల్కొండ ఆషాఢ బోనాల సన్నాహాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోల్కొండ కోటలో బుధవారం నిర్వహించనున్న సమావేశానికి రావాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌ను ఈట శ్రీనివాసరాజు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను కులవృత్తుల సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారితో కలిసి ఆహ్వానం అందించారు. – మెహిదీపట్నం, జూన్ 25

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్వోసీ..

నాంపల్లికి చెందిన సంతోష్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ లక్ష రూపాయల ఎల్వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ దారుస్సలాంలోని పార్టీ కార్యాలయంలో అందించారు. – మెహిదీపట్నం, జూన్ 25

సాహిత్యం ద్వారానే రాజ్యాధికారం

బహుజన సాహిత్య ద్వారానే పూలే, అంబేద్కర్ కాన్షీరామ్ కలలుగన్న రాజ్యం సాధిస్తుందని ప్రముఖ కవి గాయకుడు దురువు మల్లన్న అన్నారు. మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ) 7వ రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాౖరైన జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ మాట్లాడారు. అకాడమీ తెలంగాణ అధ్యక్షుడు ఎం.గౌతమ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బహుజన సాహిత్య అకాడమీ నాయకులు వర ప్రసాద్, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, బాపయ్య పాల్గొన్నారు. – చిక్కడపల్లి

భాగ్యలక్ష్మికి బీసీ నాయకుల పరామర్శ

కాచిగూడ, జూన్ 25: జాతీయ ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి భర్త రాజారామ్ ఇటీవల అకాలమరణం చెందిన సందర్భంగా మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కుల సంఘాల అధ్యక్షుడు కుందరం గణేశ్‌చారి, బీసీ సమాఖ్య అధ్యక్షుడు దుర్గయ్య పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

సంగం భూమిపై చాడా ప్రకటన బాధ్యతా రాహిత్యం

లంగర్‌హౌస్ సంగం రామాలయం భూమిపై చాడా ప్రకటనను ఖండిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, పూజారులు

కార్వాన్, జూన్ 25 : లంగర్‌హౌస్‌లోని సంగం రామాలయం భూమి పై సీపీఐ నాయకుడు చాడా వెంకట్‌రెడ్డి చేసిన ప్రకటన ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని రామాలయం కమిటీ ప్రతినిధులు, పూజారులు తీవ్రం గా ఖండించారు. చాడా వెంకట్‌రెడ్డి నిజానిజాలు తెలుసుకోకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి లేఖ రాయడాన్ని ఖండిస్తూ ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాడా ఆలయ స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోకుండా హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ప్రకటన చేయడంతో పాటు ఆలయ నిర్వాహకులను భూ కబ్జాదారులుగా చూపడం ఆయన బాధ్యతరాహిత్యానికి నిదర్శనమని, నిరంతరం దైవ సేవలో నిమగ్న మనటువంటి స్వామిజీలను, ఆలయ కమిటీని భూ ఆక్రమణదారులుగా చూపుతూ ప్రభుత్వానికి లేఖ రాయడం నీతి మాలిన చర్యగా కమిటీ అభివర్ణించింది. ఈ మఠం ఈసా, మూసీ, గుప్త గంగ పవిత్రమైన త్రివేణి సంగమముగా ప్రఖ్యాతి గాంచిందని కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఇక్కడి త్రివేణి సంగమమంలో కర్మకాండల కోసం దేశంలోని నలుమూలల నుండి అనేక మంది వచ్చి తమ వారి కర్మకాండులు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబాతో పాటు స్థానిక నాయకులు బాలప్రసాద్ తివారీ, వినేష్ సింగ్, రవీందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, లింగారెడ్డి, శేఖర్, పాండు, నాగ ప్రకాశ్‌రెడ్డి, వినోద్‌గౌడ్, జెన్న సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా కొనసాగుతున్న ‘లక్ష్యే లక్ష్యం’

విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హైదరాబాద్ డిపో–1 మేనేజర్ క్రిష్ణారెడ్డి

సుల్తాన్‌బజార్, జూన్ 25: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆదాయం పెంచేందుకు నిర్వహిస్తున్న ‘లక్ష్యే లక్ష్యం’ ఛాలెంజ్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని హైదరాబాద్ డిపో–1 మేనేజర్ బి. క్రిష్ణారెడ్డి అన్నారు. మంగళవారం గౌలిగూడ డిపో ఆవరణలో ఉద్యోగులు, వారి పిల్లల కోసం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటలలో గెలుపొందిన చిన్నారులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీజీ ఎస్ఆర్‌టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు సంస్థ ఆదాయం పెంపుదలకు ‘లక్ష్యే లక్ష్యం’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ స్వాతి, అసిస్టెంట్ ఇంజినీర్ ధనుంజయ్‌రావు, డిపో సూపర్‌వైజర్లు, ఉద్యోగులు తదితరులు పెద్దెత్తున పాల్గొన్నారు.

కాలనీలో మద్యం షాపు ఏర్పాటును నిలిపివేయాలి

నిరసన తెలుపుతున్న ఎస్ఆర్టీ కాలనీ వాసులు

ముషీరాబాద్, జూన్ 25: విద్యానగర్ ఎస్ఆర్టీ క్వార్టర్స్ నివాసాల నడుమ మద్యంషాపు ఏర్పాటును నిలిపి వేయాలని కోరుతూ స్థానికులు మంగళవారం నిరసన తెలిపారు. ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణం ఎదురుగా మరో మద్యం షాపు ఏర్పాటు చేసి నివాస ప్రాంతంలో ప్రశాంతతకు భంగం కలిగించరాదంటూ ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు ఆర్ యాదగిరి, ఎస్ సురేందర్, వినయ్, శివసాయి, వికాస్, సంజయ్, ప్రసాద్, రమాకాంత్‌లు మాట్లాడుతూ.. నివాసిత కాలనీలో మద్యం షాపుకు అనుమతి ఇవ్వరాదని కోరారు. మరో చోట అనుమతి ఇచ్చిన మద్యం షాపును తమ కాలనీలో ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వై.అమృత

అంబర్‌పేట, జూన్ 26 : నల్లకుంట డివిజన్‌లోని పలు ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను డివిజన్ కార్పొరేటర్ వై.అమృత మంగళవారం పరిశీలించారు. డివిజన్‌లోని గోల్నాక నాలాను పరిశీలించారు. భాగ్యనగర్ కమాన్, బాయమ్మగల్లీలో మెడికల్ ఆఫీసర్ డా.హేమలత, ఏఈలతో కలిసి పనులను పరిశీలించి వాణ్యతతో చేయాలని ఆదేశించారు. నాయకులు కె.జె.బాబు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

బీకాం ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 25 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వాయిదా పడిన బీకాం ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా తేదీని ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 2017, 2018 బ్యాచ్‌లకు చెందిన రీ – అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకు ఈ నెల 13న నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ పరీక్షను తిరిగి వచ్చే నెల 2న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో ఉంచినట్లు పేర్కొన్నారు.

బస్సు పాసుల జారీకి 43 కేంద్రాలు

సిటీబ్యూరో, జూన్25(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో 43 బస్సు పాస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఈడీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగులు, జేఎన్‌టీయూ విద్యార్థుల కోసం కొత్తగా జేఎన్‌టీయూ బస్టాపులో బస్సు పాస్ కౌంటర్ తెరిచామని చెప్పారు. ఈ కేంద్రాలు ఉదయం 6:30నుంచి రాత్రి 8:15 గంటల వరకు సేవలందిస్తాయన్నారు. గ్రీన్ మంత్లీ ఏసీ బస్సు పాస్‌లు కూడా జారీ చేస్తున్నట్టు వివరించారు. కాగా డిమాండ్ దృష్ట్యా మొబైల్ వెహికిల్ బస్సు పాస్ సేవలను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఏబీవీపీ ఆధ్వర్యంలో బడుల బంద్

- ఏబీవీపీ.. సంయుక్త కార్యదర్శి కమల్ సురేశ్

సుల్తాన్‌బజార్, జూన్ 25: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల అక్రమ ఫీజులను అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలంటూ ఇతర సమ స్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్య ంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ తెలంగాణ సంయుక్త కార్యదర్శి కమల్ సురేశ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. ప్రైవేట్, కార్పొరేట్ , ఇంటర్నేషనల్ పాఠశాలల్లో అక్రమంగా లక్షలాది రూపాయలు వసూలు చేసే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలని, ని బంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో బుక్స్, యూనిఫాంలను విక్రయిస్తున్న యాజ మాన్యాలపై కఠిన చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ గుర్తింపు, నిబంధనలను పాటించని ప్రైవేట్ పాఠశాలల గు ర్తింపును రద్దు చేయాలని, ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడటంతో పాటు డీఈవో, ఎంఈవో అధికా రులను నియమించాలని, మెగా డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న 24 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, అటెండర్, స్కావెంజర్‌లను నియమించాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద వి ద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు వివరించారు.